


కరువు సీమలో పారిశ్రామిక ప్రగతి



బ్రాహ్మణ కొట్కూరులో పరిశ్రమకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కలెక్టర్ ఏ. సిరి

- రూ.3,262 కోట్ల పెట్టుబడులతో జిల్లాలో ఆరు పరిశ్రమలు
- 6,500 మందికి ఉద్యోగావకాశాలు
- వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన సీఎం చంద్రబాబు
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలో పలు పరిశ్రమలు
- మంత్రులు అచ్చెన్నాయుడు, టీజీ భరత్ శంకుస్థాపన

కర్నూలు/ఓర్వకల్లు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మక మార్పులతో కర్నూలు జిల్లా పారిశ్రామిక ప్రగతి సాధిస్తోందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఆరు పరిశ్రమలు, ఎంఎస్ఎంఈ పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం వర్చువల్ ద్వారా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ పరిశ్రమల ద్వారా జిల్లాకు రూ.3,262 కోట్లకు పైగా పెట్టుబడులు రానున్నాయి. నిర్మాణాలు పూర్తి అయి కార్యరూపం దాల్చితే దాదాపుగా 6,500 మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ హబ్ పరిధిలో బ్రాహ్మణపల్లి, గుట్టపాడు వద్ద 206 ఎకరాల్లో రూ.2,750 కోట్లు పెట్టుబడితో నిర్మించనున్న రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్ లిమిటెడ్, ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, సగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్‌లకు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ పరిశ్రమలు ద్వారా 2,835 మందికి ఉద్యోగాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్థానికంగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టర్ డాక్టర్ సిరిలు శిలాఫలకాలను ఆవిష్కరించారు. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి, దేవనకొండ మండలం కప్పట్రాళ్ల, ఓర్వకల్లు మండలం బ్రాహ్మణపల్లి గ్రామాల్లో 76.24 ఎకరాల్లో రూ.30.62 కోట్లతో అభివృద్ధి చేయబోతున్న ఎంఎస్ఎంఈ పార్కులకు కూడా సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయంలో రూ.100 కోట్లతో ఏర్పాటు చేయబోతున్న మెల్‌స్టార్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు చంద్రబాబు శంకుస్థాపన చేయగా, స్థానికంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్‌లు శిలాఫలకం ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయంలో రూ.97 కోట్లలో 1.2 ఎకరాల విస్తీర్ణంలో వెంకటేశ్వర లాడ్జ్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్మించే ఆధునిక హోటల్, రెస్టారెంట్‌కు నిర్మాణానికి సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారధి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘువేంద్రరెడ్డిలు శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ... రాయలసీమ కరువు ప్రాంతం అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఓర్వకల్లు కేంద్రంగా డ్రోన్ సిటీ రాబోతుందని, దేశంలో తొలి డ్రోన్ సిటీ అని గుర్తు చేశారు. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పానీయాల ప్లాంట్‌ను రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నామని, ఇది ఫిబ్రవరిలో ప్రారంభం అవుతుందన్నారు. రిలయన్స్ ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పరిశ్రమలు
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

రాష్ట్రంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వల్లే పరిశ్రమలు వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. బ్రాహ్మణపల్లె వద్ద రూ.3 వేల కోట్లతో నిర్మించే రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రొడక్ట్ లిమిటెడ్‌ను, గుట్టపాడు గ్రామ సమీపాన సికాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఆర్‌పీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేటు లిమిటెడ్ నిర్మాణాలకు సీఎం చంద్రబాబు వర్చువల్ ద్వారా శంకుస్థాపన చేశారు. మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గౌరు చరితలు శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడారు. ఈ పరిశ్రమలు వల్ల స్థానికంగా యువతకు ఉపాధి కల్పించేలా ఇక్కడే స్కిల్ సెంటర్‌ను కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రతి నియోజకవర్గం, జిల్లా కేంద్రాల్లో ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలలు, స్కిల్ సెంటర్లను అభివృద్ధి చేయాలనే ఆలోచనతో ఉన్నారన్నారు. గుట్టపాడు గ్రామ సమీపంలో సిగాచీ కెమికల్స్ కూడా రాబోతోందన్నారు. సీఎం చంద్రబాబు విజన్ కలిగిన నాయకుడని, ఓర్వకల్లులో రెడ్‌జోన్ కింద అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు.

మిగతా 6లో..



ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో జ్యోతిప్రజ్వలన చేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి ప్రసంగాన్ని తిలకిస్తున్న మంత్రి, ఎంపీ, అధికారులు



మౌలానా సేవలు స్ఫూర్తిదాయకం

- మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ లాంటి మహనీయుల జీవితాలు, వారి ఆచరణ విద్యార్థులకు ప్రేరణ కావాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ కామర్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి సబిహా పర్వీన్, ఏపీ స్టేట్ హజ్ కమిటీ సభ్యుడు మన్సూర్ అలీ ఖాన్, ఏపీ టూరిజం డైరెక్టర్ ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ బాంబు పేలుళ్ల ఘటనతో... జిల్లాలో విస్తృత తనిఖీలు



రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఎర్రకోట వద్ద భారీ పేలుడు జరిగిన నేపథ్యంలో జిల్లాలో పోలీసులు పలు చోట్ల విస్తృత తనిఖీలు చేపట్టారు. బుధవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు పోలీసులు మంగళవారం అకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో స్పెషల్ పార్టీ పోలీసు బృందాలు, పోలీసు జాగిలాలు, బాంబు స్క్వాడ్ బృందాలు బస్టాండు, రైల్వేస్టేషన్లు, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు, దేవాలయాలు, మసీదులు, ముఖ్యమైన రహదారులు, టోల్‌గేట్లు, లాడ్జిలు, రద్దీ ప్రదేశాలలో వాహనాలు, అనుమానితుల కదలికలు, లగేజీలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు గానీ, డయల్ 100కు, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సీసీఐ పత్తి కొనుగోళ్ల పరిశీలన



సీసీఐకు రైతులు తీసుకొచ్చిన పత్తి

ఎమ్మిగనూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో పత్తి కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాలను మంగళవారం సీసీఐ మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ సంజయ్ ద్వివేది పరిశీలించారు. పట్టణ సమీపంలో మంత్రాలయం రోడ్డులో ఉన్న మూడు జిన్నింగ్ ఫ్యాక్టరీ, కర్నూలు రోడ్డులో ఉన్న మరో జిన్నింగ్ మిల్లులోని కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు ఏవిదంగా జరుగుతోంది, ఇప్పటి వరకు ఎంత కొనుగోలు చేశారన్న విషయాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిబంధనల మేరకు పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఆయన వెంట సీసీఐ అధికారులు మంగేష్, వ్యవసాయ మార్కెట్ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, సిబ్బంది ఉన్నారు.

4754.22 క్వింటాళ్ల పత్తి కొనుగోలు: ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 368 మంది రైతుల నుంచి 4754.22 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేశారు. గత నెల 30వ తేదీ నుంచి కొనుగోళ్లు ప్రారంభించారు. సీసీఐ కేంద్రాలకు విక్రయించిన పత్తిని కనిష్ఠ ధర రూ.7,737, గరిష్ఠ ధర రూ.8,060 వరకు పలికింది. పత్తిని సీసీఐకి విక్రయించిన రైతులకు వర్చువల్ ఐడీ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- కేజీబీవీ డైరెక్టర్ దేవానంద రెడ్డి

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పది, ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణ సాధించేలా కృషి చేయాలని కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ డి.దేవానందరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్చువల్ స్టూడియో భవనంలో కేజీబీవీ ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు విజయపథం కార్యక్రమాన్ని జూలై 15 నుంచి ప్రారంభించామని, దానిని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత ప్రిన్సిపాళ్లపై ఉందన్నారు. గతంలో పరీక్షల ముందు మాత్రమే ప్రత్యేక తరగతులు నిర్వహించేవారనీ, ఈసారి ప్రారంభం నుంచే రోజువారి పరీక్షలు స్టడీ అవర్స్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక పాఠ్యాంశాలు బోధించాలన్నారు. విద్యార్థులకు తరుచూ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. భోజనం తయారు చేసేటప్పుడు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శామ్యూల్ పాల్ పాల్గొన్నారు.

25 పది పరీక్షల ఫీజు చివరి గడువు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూల్‌ను డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుం లేకుండా ఈ నెల 13 నుంచి 25వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుంతో డిసెంబరు 3వ తేదీ వరకు, రూ.200 ఆలస్య రుసుంతో డిసెంబరు 10వ తేదీ వరకు, రూ.500 ఆలస్య రుసుంతో డిసెంబరు 15వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, వృత్తి విద్యా విద్యార్థులు అదనంగా రూ.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గడువు తేదీల్లో ఏమైనా ప్రభుత్వ సెలవుదినాలుగా ప్రకటిస్తే ఆ తర్వాత మరుసటి రోజున పనిదినాన్ని గడువుతేదీగా పరిగణిస్తారన్నారు. అందుబాటులో ఉన్న పాఠశాలల లాగిన్ ద్వారా మాత్రమే విద్యార్థుల ఫీజు చెల్లించాలన్నారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా, లేదా బ్యాంకు చలానాల ద్వారా చెల్లింపులను అంగీకరించరని తెలిపారు.

ఏసీబీ వలలో... డోన్ రీసర్వే డీటీ

డోన్ టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డోన్ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సునీల్ రాజా లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. మంగళవారం డోన్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సోమన్న, సీఐలు కృష్ణయ్య, శ్రీనివాసులు సిబ్బంది దాడి చేసి వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సోమన్న తెలిపిన వివరాల మేరకు వివరాలు.. కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన దామ వేణుగోపాల్ డోన్ మండలంలోని జగదుర్తి గ్రామంలో సర్వేనెంబర్.20-1, 20-బి2, 27-బీ2లలో పదెకరాల చుక్కల భూమిని పట్టా భూమిగా మార్చడానికి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాడు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదికను పంపడానికి డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజా రూ.60వేలు డిమాండ్ చేశారు. అయితే సదరు రైతుతో రూ.35వేలకు బేరం కుదుర్చుకున్నాడు. అది కూడా ఇవ్వడం ఇష్టం లేని రైతు దామ వేణుగోపాల్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో మంగళవారం దామ వేణుగోపాల్ రూ.35వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజాను విచారిస్తున్నామని, విచారణ అనంతరం కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.



ఏసీబీకి పట్టుబడిన రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సునీల్ రాజా

ప్రభుత్వ పాఠశాల్లో మంచి సదుపాయాలు

- ట్రైనీ ఐఏఎస్‌ల అభిప్రాయం
- మద్దికెరలో పర్యటించిన అధికారులు

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తోందని ట్రైనీ ఐఏఎస్‌లు అంకిత్ రాజ్‌పుత్, మోహిత్ మంగల్, భరత్‌దత్ తివారి, తన్మయి మెగ్వాల్, అమర్ బాగిల్, ఏ.సోనీలు అన్నారు. మంగళవారం మద్దికెర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలను ట్రైనీ ఐఏఎస్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి మౌలిక సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని వసతులు కల్పించిందని, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, చదువులు అన్నీ ఇస్తున్నారనీ, విద్యార్థులు ఐఏఎస్‌ల దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్‌లు మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులతో పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం బాగా తీర్చిదిద్దుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారనీ, కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలన్నారు. అనంతరం ట్రైనీ ఐఏఎస్ అధికారుల బృందంగా మద్దమ్మకుంటను పరిశీలించింది. అనంతరం మద్దికెర, బురుజుల శివారులో పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. ఉల్లి పంటలకు గిట్టుబాటు ధర లేక పూర్తిగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గుండాల్ నాయక్, ఎంపీడీవో కొండయ్య, ఎంఈవో రంగస్వామి, మోహన్, ఏపీవో నర్సిరెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ప్రధానోపాధ్యాయులు దేవేంద్రప్ప, వ్యవసాయ సిబ్బంది బోజరాజు, ఆనంద్ తదితరులు ఉన్నారు.



మద్దికెర పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ట్రైనీ ఐఏఎస్‌లు

న్యూమోనియాతో జాగ్రత్త 7

రేణిగుంటలో రోడ్డు ప్రమాదం
- కర్నూలుకు చెందిన తల్లీ కొడుకులు దుర్మరణం 7

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 7

నేడు గవర్నర్ నజీర్ రాక



- ఆర్‌యూలో 4వ కాన్వకేషన్‌కు హాజరు
- ఏర్పాట్లను పూర్తి చేసిన అధికారులు

కర్నూలు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బుధవారం పర్యటించనున్నారు. రాయలసీమ యూనివర్సిటీలో నాల్గవ స్నాతకోత్సవం(కాన్వకేషన్)తో పాటు నగరంలోని మాంటిస్సోరీ పాఠశాల సిల్వర్‌జూబ్లీ వేడుకలకు గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరవుతారు. ఈ మేరకు ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ, సీఐలు పరిశీలించారు. రాయలసీమ వర్సిటీ వీసీ వి.వెంకటబసరావు పది రోజులుగా కమిటీలు, ప్రొఫెసర్లతో సమీక్షిస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గవర్నర్ రాకతో ఎక్కడ ఇబ్బందులు తలెత్తకుండా ప్రొఫెసర్లు, పోలీసులతో చర్చలు జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి క్యాంపస్‌కు చేరుకునే విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థి వెంట మరొకరిని మాత్రమే క్యాంపస్‌లోని అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా స్నాతకోత్సవంలో భాగంగా 75 మందికి గవర్నర్ బంగారు పతకాలను అందజేస్తారు. 60 పీజీ, 15 ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ బంగారు పతకాలను ప్రదానం చేస్తారు. మరికొందరికి డాక్టరేట్, డిగ్రీ పట్టాలను అందజేస్తారు. విద్యార్థుల కోసం ఉదయం 8 గంటల నుంచి రిజిస్ట్రేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయి. 10 గంటలకు అంతా కాన్వకేషన్ హాలులో విద్యార్థులు సిద్ధంగా ఉండాలని వర్సిటీ అధికారులు సూచించారు.

గవర్నర్ పర్యటన ఇలా...

ఉదయం 10 గంటలకు విజయవాడలోని రాజ్‌భవన్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ బయల్దేరుతారు. అక్కడ ప్రత్యేక విమానం ద్వారా కర్నూలు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టుకు 10:30కి చేరుకుంటారు. 10:35కు బయలుదేరి రాయలసీమ యూనివర్సిటీకి చేరుకుంటారు. 11 నుంచి 12:15 వరకు జరిగే 4వ కాన్వకేషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12:35కు నగర శివారులోని ఇండస్ స్కూల్‌కు, ఆ తర్వాత ఏ.క్యాంప్‌లోని మాంటిస్సోరీ సీనియర్ సెంకడరీ స్కూల్‌కు చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 3:30 వరకు జరిగే గోల్డెన్ జూబ్లీ వేడుకలకు హాజరై ప్రసంగిస్తారు. అనంతరం 4:30కు బయల్దేరి ఓర్వకల్లు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. సాయంత్రం 4:45కు విజయవాడ పయనమవుతారు.



హక్కుదారులకు స్థిరాస్తి కార్డులు



గ్రామ సభలో పాల్గొన్నప్రజలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్వామిత్వ సర్వే ఫేస్-2లో 73కుగాను 23 పంచాయతీలలో ఈ ప్రక్రియ పూర్తయిన వాటికి 9(2) కింద హక్కుదారులకు స్థిరాస్తికార్డులు అందజేయనున్నారు. ఈ మేరకు సోమవారం నుంచి ఈ నెల 22 వరకు డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ఆదోని డివిజన్‌లో 11 గ్రామ పంచాయతీలు, కర్నూలు డివిజన్‌లో 2 గ్రామ పంచాయతీలు, పత్తికొండ డివిజన్‌లో 10 గ్రామ పంచాయతీలు, గ్రామ కంఠాలలో ఇళ్ల స్థలాలకు ఆస్తి హక్కు సంబంధించిన కార్డులు అందజేయనున్నారు. హక్కుదారుడు సంబంధిత ఆస్తి హక్కుపై అభ్యంతరాలు ఉంటే 10(2) కింద సవరించుకునే అవకాశం కల్పించింది. గ్రామ సభ పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారి, డిజిటల్ అసిస్టెంట్లు ఆధ్వర్యంలో జరుగుతుంది. పరిష్కారం కానీ వి.ఫాం-19 ద్వారా అప్పీల్ చేసుకుని రీసర్వే కోసం డిప్యూటీ తహసీల్దార్‌కు పంపిస్తారు. ఆధార్, మొబైల్ నెంబర్, డాక్యుమెంట్లు మొదలైన వివరాలను సేకరించి డిజిటలీకరణ చేస్తారు. సభలో తీర్మానం చేసి గ్రామ సభ రిజిస్టర్లు నమోదు చేస్తారు. ఏదైనా కుటుంబానికి డాక్యుమెంట్లు లేకపోయినా, వారి ఆస్తి గ్రామకంఠంలో 12 ఏళ్లపాటు వారి ఆధీనంలో ఉన్నట్లు గుర్తిస్తే వారికి కూడా యాజమాన్య పత్రాలు అందజేస్తారు.

పీఎం ఉపకార వేతనాల

దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 9వ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలు మించకని వారి నుంచి పీఎం యశస్వి పథకం కింద ఉపకార వేతనాలు పొందడానికి దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారిత అధికారి ప్రసూన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి 9వ తరగతిలో మెరిట్ ప్రాతిపదికన ఎంపికైన విద్యార్థులకు ఒక సంవత్సరానికి రూ.75వేలు, ఉపకారవేతనాలు ఇస్తామని, 10వ తరగతి మార్కుల ఆధారంగా ఎంపికైన ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఒక సంవత్సరానికి రూ.1,25,000 ఉపకారవేతనాలు ఇస్తామని అన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 చివరి గడువు అన్నారు. అర్హత కలిగిన విద్యాసంస్థల జాబితా, ఇతర వివరాల కోసం అప్లయ్ చేసుకోవడానికి స్కాలర్‌షిప్స్‌జీవోవి.ఇన్‌వెబ్‌సైట్‌లో అనుసరించాలన్నారు.

కష్టపడితే ఉపకార వేతనం



చాగలమర్రి బాలికల పాఠశాలలో ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం శివలక్ష్మి

చాగలమర్రి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువులో ప్రతిభ ఉన్నా ఆర్థిక పరిస్థితులు బాగోలేక కొందరు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇలాంటి వారికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోంది. ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో అర్హత సాధిస్తే 4 ఏళ్ల పాటు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్) బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ఈ ఆర్థిక ప్రయోజనం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. నంద్యాల జిల్లాలో గత ఏడాది 4,800 మంది దరఖాస్తు చేసుకోగా ఈ ఏడాది 3,932 మంది దరఖాస్తు చేసుకున్నారు. నెల రోజులు కష్టపడితే 4 ఏళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. ఆయా పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా తరగతులు నిర్వహించి ఎన్ఎంఎంఎస్ సాధించేందుకు తీర్చిదిద్దుతున్నారు.

- ప్రతిభ చాటితే 4 ఏళ్ల పాటు అందజేత

● డిసెంబరు 7న పరీక్ష

ప్రభుత్వం ప్రతి ఏడాది నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందుకు అర్హులు. డిసెంబరు 7న పరీక్ష నిర్వహిస్తారు. ఇంకా నెల రోజులు సమయం ఉంది. గత పరీక్షలో విజయం సాధించిన వారి అనుభవాలను పరిగణలోకి తీసుకొని కొద్దిగా కష్టపడి చదివి ప్రతిభ చూపితే 4 ఏళ్ల పాటు ఉపకార వేతనం అందుతుంది.

● ఏడాదికి రూ.12 వేలు

పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు నెలకు రూ.1,000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు అందజేస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఆర్థిక సాయం కొనసాగుతుంది.

● బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో

బహుళైచ్ఛిక ప్రశ్నల విధానంలో 180 ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ(మ్యాట్), స్కాలాస్టిక్ ఎబిలిటీ(శాట్), 7, 8 తరగతుల సైన్స్, గణితం, సాంఘిక శాస్త్ర పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది.



ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యాను



చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నా. 8వ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ శిక్షణ పొందడంతో పాటు ఉదయం, సాయంత్రం గణితంపై సాధన చేశా. సందేహాలను ఉపాధ్యాయులతో నివృత్తి చేసుకున్నా. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యాను. ఇప్పుడు ప్రతి నెలా రూ.వెయ్యి స్కాలర్‌షిప్ అందుతోంది.

- షేక్.మహ్మద్ మున్వర్‌బాషా, 9వ తరగతి

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం



మా పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్‌కు 27 మంది విద్యార్థులతో మొదటిసారి దర ఖాస్తు చేయించాం. వీరికి ప్రతి రోజు ప్రత్యే క తరగతులు నిర్వహిస్తున్నాం. నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షకు సిద్ధం చేస్తున్నాం. మంచి ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తున్నాం.

- శివలక్ష్మి, హెచ్ఎం, బాలికోన్నత పాఠశాల, చాగలమర్రి

పేద విద్యార్థులకు చేయూత



చిన్నపాటి శిక్షణతో ఉపకార వేతనాలకు ఎంపిక కావచ్చు. విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలి. పరీక్షల్లో ప్రతిభ చూపితే 4 ఏళ్ల పాటు ఆర్థిక చేయూత లభిస్తుంది.

-అనూరాధ, ఎంఈఓ, చాగలమర్రి

కరువు సీమలో పారిశ్రామిక ప్రగతి

5వ పేజీ తరువాయి



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

అదే జరిగితే పలు కెమికల్ పరిశ్రమలు వస్తాయన్నారు. రూ.23 వేల కోట్లతో సెమికండక్టర్స్ పరిశ్రమ, రూ.7వేల కోట్లతో ఆగస్త్య సోలార్ యూనిట్ ఏర్పాటు జరగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ డా.సిరి మాట్లాడుతూ ఆరు ప్రాజెక్టులు, మూడు ఎంఎస్ఎంఈ పార్కులు ముఖ్యమంత్రి సమక్షంలో శంకుస్థాపన చేశారన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందని, వచ్చే పరిశ్రమల్లో స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చేలా మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సందీప్ కుమార్, ఏపీఐఐసీ జడ్ఎం మధుసూదన్ రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, రిలయన్స్ సంస్థ ప్రతినిధి అర్పన్ బసు, కిషన్‌పారిశ్రామికవేత్త సుబ్బారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్లు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీవో నాగ అనుసూయ, నాయకులు మోహన్ రెడ్డి, గోవిందరెడ్డి, సుధాకర్ రెడ్డి, రాంభూపాల్ రెడ్డి, చంద్రపెద్ద స్వామి, బ్రాహ్మనపల్లెనాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

● పరిశ్రమల ద్వారా ఉపాధి కల్పన

- వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ఓర్వకల్లు పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేస్తున్న మెల్‌స్ట్రార్ ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయగా, మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఏపీ ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజర్ డైరెక్టర్ ప్రవీణ్ ఆదిత్య, జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో వాణిజ్య ప్రైవేటు పైలట్లకు శిక్షణ ఇచ్చే ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ డీజీసీఏ ఆమోదిత కోర్సులు, కమర్షియల్ పైలట్ లైసెన్స్ ప్రైవేటు లైసెన్స్ మల్టీ ఇంజన్ రేటింగ్ ఇన్‌స్ట్రుమెంట్స్ తదితర కోర్సుల్లో ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా వంద మందికి, పరోక్షంగా 250 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. వచ్చే ఏడాది జూలై నాటికి నిర్మాణాలు పూర్తి చేసి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మెల్‌స్టాల్ లిమిటెడ్ డైరెక్టర్ కష్యప్, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, డీఐవో ప్రవీణ్ రెడ్డి, డీఈ అమృత్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైలం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి పాలకమండలి ఛైర్మన్ రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ప్రాకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలు, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.



స్వామివారి దర్శనం అనంతరం వస్తున్న మంత్రి బీసీ దంపతులు

లక్ష్యాన్ని అధిగమించాలి

ఆళ్లగడ్డ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి వీఓ తమ లక్ష్యాన్ని మార్చి నాటికి పూర్తి చేయ్యాలని పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి కోరారు. మంగళవారం స్థానిక పోస్టాఫీసును జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ అప్పలస్వామి అకస్మికంగా తనిఖీ చేశారు. ఒక సంవత్సరం రికార్డులను పరిశీలించారు. అనంతరం సబ్‌డివిజన్‌లోని పోస్ట్ మాస్టర్స్‌తో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామనాథ్, పోస్ట్ మాస్టర్ గురువ య్య, జాకీర్ హుసేన్, కరిముల్లా పాల్గొన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోహరాపురం వద్ద హంద్రీనదిలో మంగళవారం గుర్తుతెలియని మృతదహం లభ్యమైంది. స్థానికుల సమాచారంతో పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వయస్సు 40-45 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. శరీరంపై లేత నీలిరంగు ప్యాంటు, క్రీం కలర్ షర్టు ఉంది. శరీరం పూర్తిగా ఉబ్బిపోయింది. పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు 9121101059 నెంబర్‌కు ఫోన్ చేయాలని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉల్చాల గ్రామానికి చెందిన రఘువరన్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. ఓ ప్రైవేటు కంపెనీలో రికవరీ ఏజెంటుగా పని చేస్తున్నాడు. కంపెనీకి సంబంధించిన డబ్బులు వాడుకుని, తిరిగి కట్టలేక మనస్తాపానికి గురై సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తాలుకా పోలీసులు తెలిపారు.

అంకిరెడ్డి పల్లెలో మరో యువకుడు..


దాసరి కార్తీక్ (ఫైల్)

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలం లోని అంకిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దాసరి కార్తీక్(23) మంగళవారం తన పుట్టిన రోజునే ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కార్తీక్ అగ్రికల్చర్ విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటున్నాడు. 2016లో తల్లి మరణించిన తర్వాత తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. తండ్రి దాసరి శ్రీనివాసులు గతంలో సమరసత జిల్లా ధర్మ ప్రచారక్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఆరెస్సెస్‌లో జిల్లా కార్యవాహ విధులు నిర్వహిస్తున్నారు. జీవితంపై విరక్తి చెందిన కార్తీక్ మంగళవారం ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో పైకప్పు దంతెకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం


వృద్ధురాలిని పోలీసులకు అప్పగిస్తున్న యువకులు

బండిఆత్మకూరు నవంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపురం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనే 68 ఏళ్ళ వృద్ధురాలు కుందూనదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన మంగళవారం జరిగింది. ఈ ఘటనను చూసిన బండి ఆత్మకూరు యువకులు ఫిదా, సూరజ్, శీను, ఆఫ్రోజ్ నదిలోకి దూకి కొట్టుకుని పోతున్న ఈశ్వరమ్మను ఒడ్డుకు చేర్చారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసికెళ్లారు. అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నట్లు తెలుస్తోందని ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఆమె సోదరుడు కృష్ణారెడ్డికి వృద్ధురాలిని అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

అధికారులు పట్టించుకోలేదని మాజీ జవాను...

నంద్యాల టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఆవరణలో మంగళవారం మాజీ జవాను శ్రీనివాసులు ఆత్మహత్యా యత్నం చేసుకున్నాడు. జగజ్జననీ నగర్‌కు చెందిన మాజీ జవాన్ శ్రీనివాసులు ఇంటి ఎదురుగా ఒక వ్యక్తి అక్రమంగా ముందుగా వచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాడు. దీనిపై జవాను పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ వారు పట్టించుకోకపోవడంతో విసిగిపోయిన జవాను మంగళవారం మున్సిపాలిటీ ఆవరణలో విష ద్రావణం తాగి ఆత్మహత్య యత్నం చేశాడు. స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన గుండ్ర గొల్ల ఎల్లమ్మపై దాడి ఘటనలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సి.ఐ రమేష్‌బాబు వెల్లడించారు. గొల్ల యల్లమ్మ భర్త చౌడయ్యకు చెందిన పొలం వారి కూతుర్లు కౌలుకు ఇచ్చిన విషయంలో గొడవ పడగా అదే గ్రామానికి చెందిన గొల్ల బాలయ్య, నాగలక్ష్మి, కళావతి దాడి చేశారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- ఉమ్మడి జిల్లాలోని 57 గ్రంథాలయాల్లో వారం రోజులు విభిన్న కార్యక్రమాలు
- గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి. పెద్దక్క



కర్నూలు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచి 20 వరకు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జిల్లా కేంద్రంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటూ, ఉమ్మడి జిల్లాలోని అన్ని శాఖ గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి వి.పెద్దక్క తెలిపారు. మంగళవారం పాతనగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో రోజువారీ కార్యక్రమాల వివరాలుల ఆమె వెల్లడించారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు ఉమ్మడి జిల్లాలోని 57 శాఖా గ్రంథాలయాల్లో, 133 పుస్తక నిక్షిప్త కేంద్రాల్లో ఈ వారోత్సవాలు ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో 14న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జాతీయ పతాక ఆవిష్కరణ, అనంతరం మాజీ ప్రధాని పండిట్ నెహ్రూ, గ్రంథాలయ పితామహుల చిత్రపటాలకు పుష్పాలంకరణ, ఉదయం 11 గంటలకు విద్యార్థులతో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ర్యాలీ ఉంటాయని తెలిపారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి, జేసీ నూరుల్ ఖమర్, మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర, కేజీ గంగాధరరెడ్డి హాజరవుతారని తెలిపారు. తొలిరోజున బాలల దినోత్సవం, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ఆమె తెలిపారు. 15న పుస్తక ప్రదర్శనలు, పురాతన నాణెముల ప్రదర్శన, అవగాహన సదస్సులు ఉంటాయి. మధ్యాహ్నం 2 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. 16న గ్రంథాలయ ఉద్యమ పితామహుల సంస్మరణ, 17న చిత్రలేఖన పోటీలు, కవి సమ్మేళనాలు, సాహితీ సదస్సులు, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు వక్తృత్వ పోటీలు, వివిధ రకాల ఆటల పోటీలు, 19న క్విజ్ పోటీలు, మహిళా దినోత్సవం, 20న వారోత్సవాల ముగింపు వేడుకలు, బహుమతుల ప్రదానోత్సవం ఉంటుంది. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

న్యుమోనియాతో జాగ్రత్త

- చిన్నారులు సతమతం
- జీజీహెచ్‌లో ఏటా 1,500 కేసులు
- నేడు వరల్డ్ న్యుమోనియా నివారణ దినం



కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చలికాలం వచ్చిందంటే చాలా మంది చిన్న పిల్లల్లో న్యుమోనియా వ్యాధి లక్షణాలు కనపడుతున్నాయి. చలి తీవ్రత పెరిగే కొద్ది ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. తరచూ జలుబు, దగ్గులతో అలసిపోతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జలుబు దగ్గు, జ్వరంతో పాటు ఆయాసం ఎక్కువైతే అది న్యుమోనియా వ్యాధికి దారి తీయొచ్చు. న్యుమోనియాను నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ముప్పు. ఈ వ్యాధి కారణంగా ప్రపంచ వ్యాప్తంగా ఏకంగా 26 లక్షల మంది చనిపోగా, ఇందులో 7 లక్షల మంది చిన్నారులు ఉన్నారు. న్యుమోనియాను పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో చైల్డ్ న్యుమోనియాకు వ్యతిరేకంగా గ్లోబల్ కోయలిషన్-2009 నవంబరు 12న మొదటిసారిగా వరల్డ్ న్యుమోనియా డేను నిర్వహించింది.

న్యుమోనియా బ్యాక్టీరియా లేదా వైరస్ కారణంగా ఊపిరితిత్తులకు సంక్రమించే వ్యాధి. ఊపిరితిత్తుల్లోని గాలి గదుల్లోకి బ్యాక్టీరియా లేదా వైరస్‌తో నిండిన ద్రవ పదార్థం చేరడం వల్ల శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతుంది. ఇన్‌ఫెక్షన్‌కు కారణమయ్యే సూక్ష్మ క్రిమి రకాన్నిబట్టి వ్యాధి ప్రభావం ఉంటుంది.

లక్షణాలు ఇవీ..

న్యుమోనియాకు గురైన వారిలో దగ్గు, జ్వరం, జలుబు లక్షణాలు ఉంటాయి. జ్వరంతో పాటు ఆయాసం ఎక్కువ కావడం, శ్వాస కోశంలో నొప్పి, ఛాతీ భాగంలో నొప్పి, తలనొప్పి, ఆక్సిజన్ స్థాయిలో హెచ్చుతగ్గులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొందరిలో వికారం, వాంతులు, విరేచనలు కలుగుతాయి. తొలి దశలో ఉన్నప్పుడు గుర్తించి సరైన చికిత్స చేసుకోవాలి.

పీసీవీతో చెక్



ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రొటీన్ ఇమ్యూనైజేషన్‌లో భాగంగా 6 వారాలు, 14 వారాలు, 9వ నెల వయస్సులో చిన్నారులకు మూడు డోసుల పీసీవీ వ్యాక్సిన్ ఇస్తున్నారు. ఇది భవిష్యత్తులో చిన్నారులకు న్యుమోనియా రాకుండా అడ్డుకుంటోంది. దీంతో పాటు న్యుమోనియా వచ్చిన చిన్నారులను, ఆశా, ఏఎన్ఎంలు గుర్తించి వారికి దగ్గు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే దగ్గు సిరప్ ఇస్తారు..

ఉమ్మడి జిల్లాలో 7వేల మంది..

ఉమ్మడి జిల్లాలో ఏటా 7వేల మంది చిన్నారులు న్యుమోనియాతో బాధపడుతున్నారు. 2025 కర్నూలు జీజీహెచ్‌లో జనవరి నుంచి ఇప్పటి వరకు 910 మంది చిన్నారులు న్యుమోనియాతో అడ్మిట్ అయ్యారు. ఇక నంద్యాల జీజీహెచ్, ఆదోని ఏరియా ఆసుపత్రుల్లో కూడా పీఐసీయూ, ఎన్ఐసీయూ యూనిట్లలో చిన్నారులు న్యుమోనియాతో చికిత్స తీసుకుంటున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో 7వేల మంది ఈ వ్యాధి లక్షణాలతో బాధపడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

ఏడాదిలోపు చిన్నారుల్లో ఎక్కువ



కర్నూలు జీజీహెచ్‌లో ఏడాదిలోపు పిల్లలు ఎక్కువగా న్యుమోనియాలక్షణాలతో బాధపడుతూ పీఐసీయూ, ఎన్ఐసీయూలో చేరుతుంటారు. వీటిలో వంద శాతం, 5 శాతం మరణాలు ఉంటాయి. న్యుమోనియా లక్షణాలు కనబడగానే వెంటనే వైద్యులను సంప్రదించి ఆసుపత్రిలో చేరాలి. నెలలోపు చిన్నారులను ఎన్ఐసీయూ, నెలపైబడి చిన్నపిల్లలను పీఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నాం. **- డా.బి. విజయానందబాబు, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, చిన్న పిల్లల విభాగం, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి**

సకాలంలో చికిత్స అందించాలి



న్యుమోనియా సాధారణంగా చిన్న పిల్లల్లో ఎక్కువగా వస్తుంది. దగ్గు, ఆయాసం, జలుబు, జ్వరం లక్షణాలు కనిపిస్తాయి. చిన్నారుల్లో ఛాతీనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఉంటే వెంటనే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలి. బ్యాక్టీరియా కారణంగా సోకే న్యుమోనియాకు యాంటి బయాటిక్స్ ద్వారా చికిత్స అందించవచ్చు. **- డా.కే. సింధూర రెడ్డి, కన్సల్టెంట్ పీడియాట్రీషన్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్**

అండర్ ఫైవ్ కిల్లర్



భారతదేశంలో న్యుమోనియాను అండర్ ఫైవ్ కిల్లర్‌గా పిలుస్తున్నారు. జ్వరం, దగ్గు నిమిషానికి 50, 60 సార్లు ఎక్కువగా ఊపిరి తీసుకోవడం, ఛాతి ఎముకల ఎగురవేయడం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యం గా న్యుమోనియా ఉన్నవారిలో జ్వరం ఉంటుంది. ఆ సమయంలో తడిగుడ్డలతో తుడవడం మంచిది కాదు. **- డా.జి. సుధాకర్, సీనియర్ పీడియాట్రీషన్ కిమ్స్ హాస్పిటల్, కర్నూలు**

వలస వెళ్లి మృత్యు ఒడికి..

- ఆర్లబండ, మూగలదొడ్డి వలస కూలీలు మృతి
- గ్రామాల్లో విషాద ఛాయలు


దుద్ది హరికృష్ణ (ఫైల్)


వెంకటరెడ్డి (ఫైల్)

కోసిగి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): బతుకుపోరాటంలో వలసవెళ్లిన రెండు కూలీల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కోసిగి మండల పరిధిలోని ఆర్లబండ గ్రామానికి చెందిన దుద్ది హనుమంతు, వీరారెడ్డి దంపతుల కుమారుడు దుద్ది హరికృష్ణ (22) నెల రోజుల క్రితం తెలంగాణకు పత్తి పొలాల్లో పని చేయడానికి వలస వెళ్లాడు. అయితే సోమవారం సాయంత్రం పత్తి పొలంలో పని చేస్తూ స్పృహ కోల్పోయి అక్కడే మృతి చెందాడు. హరికృష్ణ మృతదేహాన్ని తోటి కూలీలు, కుటుంబ సభ్యులు గ్రామానికి తీసుకువచ్చి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని మూగలదొడ్డి గ్రామానికి చెందిన బోయ వెంకటరెడ్డి (25) మూడు నెలల క్రితం భార్య మహేషమ్మతో కలిసి ముగ్గురు పిల్లలను వెంట పెట్టుకుని తిరుపతిలో సిమెంటు పనికి వెళ్లాడు. సోమవారం సాయంత్రం పని నిమిత్తం బైక్‌పై వెళ్తుండగా.. వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అక్కడే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తిరుపతి పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. బుధవారం వెంకటరెడ్డి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. ఒకరోజులోనే ఇద్దరు యువ కూలీలు వలసవెళ్లి మృత్యు ఒడికి చేరడంతో కోసిగి మండలంలోని ఆర్లబండ, మూగలదొడ్డి గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పొట్టచేత పట్టుకుని వలస వెళ్లి మృత్యుఒడికి చేరడంతో వారి కుటుంబాల్లో విషాదం అలముకుంది.

రేణిగుంటలో కారును ఢీకొన్న లారీ

- కర్నూలుకు చెందిన తల్లీ కొడుకులు దుర్మరణం
- మరొకరికి తీవ్రగాయాలు
- స్వల్పగాయాలతో బయటపడిన చిన్నారి



గాయాలతో బయటపడిన త్రిషిక, దివ్య

రేణిగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలుకు చెందిన ఇద్దరు దుర్మరణం పాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. రేణిగుంట సమీపంలోని ఓ మలుపు వద్ద అదుపు తప్పిన లారీ.. కారును ఢీకొన్న ఘటనలో కర్నూలు నగరానికి చెందిన తల్లీకొడుకులు చంద్రభాను సింగ్, సరస్వతీ బాయిలు దుర్మరణం పాలయ్యారు. కోడలికి తీవ్రగాయాలు కాగా, మనవరాలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట- కడప మార్గంలోని చైతన్యపురం క్రాస్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. రేణిగుంట సీఐ జయచంద్ర తెలిపిన మేరకు వివరాలు... కర్నూలు నగరానికి చెందిన చంద్రభాను సింగ్ చెన్నైలోని మెడికల్ ఏజెన్సీలో బిజినెస్ మేనేజర్. ఆయన భార్య దివ్య చెన్నైలోనే బరోడా బ్యాంక్ రీజినల్ ఆఫీసర్. వారాంతపు సెలవులు కర్నూలులో గడిపారు.

సోమవారం సాయంత్రం కర్నూలు నుంచి కారులో తన తల్లి సరస్వతిబాయి, భార్య దివ్య, కుమార్తె త్రిషికతో కలిసి చంద్రభాను సింగ్ చెన్నై బయలుదేరారు. మంగళవారం తెల్లవారుజామున రేణిగుంట మండలం చైతన్యపురం క్రాస్ వద్దకు కారు చేరుకుంది. అదే సమయంలో రేణిగుంట నుంచి కడప వెళ్తున్న లారీ మలుపు వద్ద అదుపుతప్పి కారుని ఢీకొంది. కారు నడుపుతున్న చంద్రభాను సింగ్ (37) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పక్కన కూర్చున్న భార్య దివ్యకు రెండు కాళ్లు విరగడంతో పాటు తలకు ఓవైపు తీవ్రగాయాలయ్యాయి. వెనక సీటులోని సరస్వతి బాయి(60) తలకు తీవ్రగాయాలయ్యాయి. డ్రైవింగ్ సీటుకు వెనుక కూర్చున్న కుమార్తె త్రిషిక స్వల్పగాయాలతో బయటపడింది. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. అనంతరం వాహనంలో క్షతగాత్రులను తరలిస్తుండగా మార్గమధ్యంలో సరస్వతిబాయి మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. దివ్య పరిస్థితి విషమంగా ఉంది. ఎస్ఐ నాగరాజు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనానికి నిప్పు.. దెబ్బతిన్న కారు

కొలిమిగుండ్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుడి గ్రామంలో ఇంటి వద్ద పార్కు చేసిన ఉన్న కారుకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. గ్రామానికి చెందిన పోలు సురేష్ తన బొలేరో వాహనాన్ని తమ పశువుల షెడ్డు వద్ద పార్కింగ్ చేసి టార్పాలింగ్ కప్పి ఉంచాడు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు వాహనానికి నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. ఈ మంటల్లో కారుకు కప్పిన టార్పాలింగ్ పూర్తిగా కాలిపోగా కారు పాక్షికంగా దెబ్బతిన్నట్లు కొలిమిగుండ్ల సి.ఐ రమేష్‌బాబు వెల్లడించారు. ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.


దెబ్బతిన్న కారును పరిశీలిస్తున్న సీఐ

అబుల్‌కలాం ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం


ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తూ..


వేదికపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

నంద్యాల నూనెపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భారత దేశ అభివృద్ధికి పునాది వేసిన మహనీయుడు, స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆజాద్ 137వ జయంతి సందర్భంగా పట్టణంలోని అబుల్ కలాం స్థూపం దగ్గర జేసీ నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ టౌన్ హాల్‌లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవంలో జేసీ పాల్గొన్నారు. అబ్దుల్ కలాం స్వాతంత్ర్య పోరాటంలో తమ ఆలోచనతో అజరామరమైన సేవలందిచారన్నారు. అల్-హి-లాల్ దినపత్రిక ద్వారా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ప్రజల్లో నింపారని వివరించారు. నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ దేశంలో శాస్త్ర, సాంకేతిక విద్య అభివృద్ధికి, ఉన్నత విద్య సంస్థల ఏర్పాటుకు అబుల్ కలాం ఆజాద్ బలమైన పునాదులు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల మున్సిపల్ కమిషనర్ శేషన్న, డీఈవో జనార్దన్‌రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్, మెప్మా పీడీ వెంకటదాస్, డియోసెస్ బిషప్ రెవ.సంతోశ్ ప్రసన్నరావు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.ఖలీల్, ఉర్దూ డీఐ అస్మదుద్దీన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులకు వాట్సాప్ గ్రూపు



ఏర్పాటు చేసిన మార్కెట్ కమిటీ సెక్రటరీ చంద్రమౌళి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో తాము పండించిన పత్తిని అమ్ముకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. రైతుల కష్టాలను గుర్తించిన ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ చంద్రమౌళి రైతులకు వివిధ యాప్‌ల వివరాలను అందించేందు కోసం ఒక వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఈ గ్రూపులో రైతులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రచారాన్ని చేశారు.

వ్యక్తి అరెస్టు

- రిమాండ్‌లో త్రీ టౌన్ పోలీసులకు చుక్కెదురు

నంద్యాల టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి బొగ్గరపు నాగరాజును అరెస్టు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరుకు చెందిన వ్యాపారి మను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే వీరి ఇద్దరి మధ్య వ్యాపార లావాదేవీలు ఉన్నట్లు తెలిపారు. దీంతో విచారణ చేసి సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండును తిరస్కరించింది. దీనిపై బొగ్గరపు నాగరాజు, ఆయన తరపున న్యాయవాది మాట్లాడుతూ.. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా త్రీటౌన్ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసినట్లు ఆరోపించారు. దీంతో కోర్టు త్రీటౌన్ పోలీసులకు రిమాండును తిరస్కరించింది.

శివారుపై శీతకన్ను

● అభివృద్ధికి దూరం...అడుగైనా పెట్టలేరు..
● పలు కాలనీల్లో బురదమయమైన మట్టి రోడ్లు


భార్గవ్ హోమ్స్‌లో రహదారి దుస్థితి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని శివారు కాలనీలను అధికారులు పట్టించుకోవడం లేదు. పలుచోట్ల రోడ్లపై రోడ్లు వేస్తున్న అధికారులు తమ ప్రాంతంలో మాత్రం నిర్మించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల చెక్‌పోస్టు, పెద్దపాడు ప్రాంతంలో పదుల సంఖ్యలో కాలనీల్లో నేటికి మట్టి రోడ్లే కనిపిస్తున్నాయి. చిన్న వర్షం కురిస్తే చాలు బురదతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఎటుచూసిన అధ్వానమే..

పెద్దపాడు సమీపంలోని రిచ్‌మండ్ కాలనీ, రాజీవ్‌గృహకల్ప, శ్రీనివాసనగర్, శాంతినగర్, శివప్ప కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు లేవు.

● ఎఫ్‌సీఐ కాలనీ-2లో ఉన్న భార్గవ్ హోమ్స్, రవిరెడ్డి హోమ్స్, స్కంద ఉన్నతి విల్లాస్‌లో సుమారు వెయ్యి గృహాలు ఉన్నాయి. సరైన రోడ్లు, డ్రైనేజీల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● 20వ వార్డులోని బద్రినాథ్‌నగర్, ధనలక్ష్మినగర్, వాసవినగర్‌లో ఈ సంవత్సరం మేలో రూ.73.21 లక్షలతో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే పనులు పూర్తికాలేదు.


స్కంద ఉన్నతి విల్లాస్‌లో ఇలా..

ఇబ్బందిగా ఉంది

రోడ్లు, డ్రైనేజీ లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. ఇక వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇంటి పన్నులు, నీటి చార్జీలు వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు అభివృద్ధి చేయడానికి ముందుకు రావడం లేదు.- **నవీన్‌కుమార్, భార్గవ్ హోమ్స్**

నేడు 'మాంటిస్సోరి' స్వర్ణోత్సవ వేడుకలు

● హాజరుకానున్న గవర్నర్

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాంటిస్సోరి విద్యాసంస్థల స్వర్ణోత్సవాల వేడుకలకు రాష్ట్ర గవర్నర్ డా.అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎ.క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో స్వర్ణోత్సవాల వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. 50 ఏళ్ల క్రితం విద్యానగర్‌లో కేవలం 12 మందితో ఏర్పాటైన మాంటిస్సోరి, నేడు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 9 ప్రాంతాల్లోని శాఖలలో విస్తరించినట్లు వ్యవస్థాపకురాలు కళ్యాణమ్మ కుమారుడు రాజశేఖర్ అన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి, రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎంపీలు బస్తిపాటి నాగరాజు, డా.బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, డీఐజీ, కలెక్టర్ పాల్గొననున్నట్లు తెలిపారు.

మంత్రికి వినతి ఇపత్రం

జిల్లాకు వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడును వయోజన విద్య సూపర్‌వైజర్స్ మంగళవారం కలిశారు. సమగ్ర శిక్ష అభియాన్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ మెమో ప్రకారం తమను ఆదుకోవాలని మేరీ మరియం, గోకవటి విజ్ఞప్తి చేశారు.

రహదారి పనుల పరిశీలన

సి.బెళగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చేస్తున్న ఆర్‌అండ్‌బీ రహదారి పనులను మంగళవారం డీఈ రమణ, ఏఈ పెర్సీపెబీ పరిశీలించారు. డీఈ రమణ మాట్లాడుతూ మండల కేంద్రంలో కిలోమీటర్ సీసీ రోడ్డు, అలాగే కంబందహాల్‌లో సీసీ రోడ్డు, అనంతరం సిబెళగల్ నుంచి కంబదహాల్ వరకు రూ5.5 కోట్లు మంజూరు అయినట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన కోడుమూరు ఎమ్మెల్యే


మంత్రితో ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన మంత్రి అచ్చెన్నాయుడిని మంగళవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కలిశారు. ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన ఫ్లైట్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్‌ను సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ప్రభుత్వం సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తోందన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా కూడళ్లు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని కూడళ్లను ట్రాఫిక్ నియంత్రణకు వీలుగా తీర్చిదిద్దాలని కమిషనర్ విశ్వనాథ్ ఆదేశించారు. మంగళవారం శ్రీరామ థియేటర్ వద్ద బసవేశ్వర కూడలిను పరిశీలించి, అభివృద్ధి పనులపై సూచనలు ఇచ్చారు. అలాగే దేవనగర్ ప్రాంతంలో పర్యటించి మౌలిక సదుపాయాల కల్పన చేపట్టాలని ఆదేశించారు. డీఈఈ క్రిష్ణలత, ఏఈఈ మహేష్, ఖాజా మోహిద్దీన్ ఉన్నారు.


శ్రీరామ థియేటర్ వద్ద కూడలిని పరిశీలిస్తున్న కమిషనర్ విశ్వనాథ్

నాణ్యమైన విద్య అందించాలి

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈవో సునీలమ్మ ఆదేశించారు. మంగళవారం పెంచికలపాడు గ్రామంలోని ఎంపీపీ, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎస్‌ఏ-1 పరీక్షలను తనికీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు.


భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో సునీలమ్మ

గ్రంథాలయ వారోత్సవాలకు ఆహ్వానం


ఎంపీ నాగరాజుకు బొకే ఇస్తున్న గ్రంథాలయ అధికారి

కర్నూలు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14 నుంచీ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రారంభం కానున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు రావాలని ఇన్‌చార్జి కార్యదర్శి వి. పెద్దక్క కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును ఆహ్వానించారు. లైబ్రేరియన్లు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్.బాషా, పర్యవేక్షకుడు మక్బుల్ బాషా పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సన్మానం


హరికిషన్, వెంకటకృష్ణను సన్మానిస్తున్న సాహితీవేత్తలు

కర్నూలు కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రస్థాయి పురస్కారాలు అందుకున్న డాక్టర్ ఎం.హరికిషన్, జి.వెంకటకృష్ణలను ముద్రిక కళా స్రవంతి సంస్థ అధ్యక్షుడు ముద్రిక భాస్కర్ మంగళవారం సన్మానించారు. డాక్టర్ ఎం. హరికిషన్ ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం బాల సాహిత్య అవార్డును అందుకోగా, జి.వెంకటకృష్ణ నిజామాబాద్ అమృత తుల్య జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. అనంతరం రచయిత మారుతి పౌరోహితం రాసిన ప్రణయ హంపీ నవల కన్నడ అనువాద పుస్తక ముఖచిత్రాన్ని సాహితీవేత్త చంద్రశేఖర్ శర్మ ఆవిష్కరించారు. కవులు కెంగార మోహన్, ఆద్య వెంకటేశ్వరరెడ్డి, తెలుగు వెంకటేశ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీకి నిధులు ఇవ్వండి

● మంత్రిని కోరిన వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో అభివృద్ధి పనులు చేసేందుకు నిధులు కేటాయించాలని వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం కర్నూలు నగరంలోని మౌర్యఇన్‌లో వినతి పత్రం అందజేశారు. కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ నిధులు లేక నిలిచిపోయిందని, అదే విధంగా కమిషన్ ఏజెంట్లు తగినన్ని షాపులు లేక ఒకే గదిలో ఇద్దరు ముగ్గురు వ్యాపారం నిర్వహించాల్సి వస్తోందన్నారు. స్పందించిన మంత్రి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.


మంత్రితో శేషగిరిశెట్టి

విద్యాభివృద్ధికి మౌలానా సేవలు స్ఫూర్తిదాయకం

● విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో మౌలానా జయంతి


మున్సిపల్ కార్పొరేషన్‌లో నివాళి అర్పిస్తున్న కమిషనర్


స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేస్తున్న ఏఎస్పీ హుస్సేన్ పీరా


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ..

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): భారతదేశపు తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయమని విద్యాభివృద్ధికి చిరస్మరణీయమని నగర పాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. మంగళవారం కార్యాలయంలో భారతరత్న మౌలానా జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, డీసీపీ వెంకటరమణ, అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, సూపరింటెండెంట్ రామక్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అబ్జర్వర్ కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

● జీసస్ మినిస్ట్రీస్ సోల్జర్స్ ఫౌండర్ జి.రవికుమార్ అధ్వర్యంలో ఉర్దూ పాఠశాలలో విదార్థులకు స్పోర్ట్స్ కిట్లును పంపిణీ చేశారు. ఏఎస్పీ హుస్సేన్‌పీరా, జీసస్‌సెక్రటరీ, ఆర్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● ఆవాజ్ కమిటీ కార్యదర్శి ఎస్ఎండీ.షరీఫ్ అధ్యక్షతన విశ్రాంత చరిత్ర అధ్యాపకులు మన్సూర్ రహమాన్, నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుస్సేన్ హజరై దేశానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలను కొనియాడారు. ఉపాధ్యక్షుడు షేక్ నయీం, డి.పార్వతయ్య, మహబూబ్‌బాషా, షేక్షావలి, నూర్‌వలి పాల్గొన్నారు.

మౌలానా సేవలు దేశానికి దిక్సూచిః

కర్నూలు అర్బన్: మౌలానా అబుల్ కలాం సేవలు దేశానికి దిక్సూచీ లాంటిందని ఉపకులపతి, ప్రొఫెసర్ ఎస్.షాఫీఖాన్ అన్నారు. మంగళవారం ఉర్దూ యూనివర్సిటీలో మౌలానా 137వ జయంతి నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహబూబ్ భాషా పాల్గొన్నారు.

● ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి నివాళులు అర్పించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా పక్రున్నీసా బేగం, ఆధ్యాపకులు వి.వింధ్యావాసిని దేవి, నాగన్న, బాలసుబ్రహ్మణ్యం, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, బి.బతుకన్న, బజారన్న, షేక్ ఖాజా హుస్సేన్, సూర్యప్రకాష్ రెడ్డి, దామోదరం రాధకృష్ణ, సత్యరాజు, షేక్ మాలీక్ బాషా, వసీ భాషా, తదితరులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

● అదుపులో 11 మంది..

కర్నూలు క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉల్చాల రోడ్డు ఆదిత్యనగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహి స్తున్న ముఠాపై నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం దాడులు చేశారు. సమాచారం మేరకు.. కొంత కాలంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారం=తో దాడులు ఏసి 11మందికి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అమ్మాయిలను తెచ్చి వ్యభిచారం చేయిస్తున్నారని విచారణ చేస్తున్నామని ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

పెండింగ్ జీతాలు ఇవ్వాలి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు గత కాంట్రాక్టర్ ఇవ్వాల్సిన 2 నెలల వేతన బకాయిలు పీఎఫ్ ఇప్పించాలని సూపరింటెండెంట్‌ను కోరారు. మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప నగర కార్యదర్శి చంద్రశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఏజెన్సీ కాలపరిమితి దాటిపోయి 4 నెలలు కావస్తున్నా కార్మికులకు పెండింగ్ జీతాలు ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. స్పందించిన సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

స్టాఫ్ నర్సు మంజులదేవికి అభినందన


మంజులదేవిని అభినందిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్విమ్మింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన స్టాఫ్ నర్సు మంజులదేవిని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు అభినందించారు. గత నెల గుంటూరు మంగళగిరిలో జరిగిన పోటీల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించిందని, ఇప్పుడు విజయవాడలో మాస్టర్స ఇంటర్ డిస్ట్రిక్ట్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో రెండు బంగారు, మరో రెండు సిల్వర్ పతకాలు సాధించిందని ప్రశంసించారు. ఆర్ఎంవో డా.వెంకటరమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయి, నర్సింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఎం.లీలావతి, కోశాధికారి లక్ష్మినరసమ్మ, హెడ్ నర్సులు లీలారాణి, కలావతి, ఆదిలక్ష్మి, శ్రీదేవి, స్టాఫ్ నర్సులు హర్ష పాల్గొన్నారు.

సార్జెంట్‌గా వేణుగోపాల్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి):పరిపాలన కారణాతో ఎంఎన్‌వోగా పని చేస్తున్న బి.వేణు గోపాల్‌ను సార్జెంట్‌గా నియమిస్తూ ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరిం టెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు మంగళ వారం ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం పని చేస్తున్న ఉరు కుందయ్య నుంచి వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరించి నిజాయితీగా నిర్వహించాలని ఆదేశించారు. శనివారం రాత్రి పిజియోథె రపీ విభాగంలో చోరీ ఘటన విషయంలో నిర్లక్ష్యంగా వహించిన ఇద్దరు సెక్యూరిటీ సూపర్ వైజర్లు ఇప్పటికే సస్పెండ్ కాగా, సార్జంట్ ఉరుకుందయ్యను కూడా సూప రింటెండెంట్ తొలగించారు.

విద్యార్థులను వలసకు తీసుకెళ్లకండి : ఎంఈవో

సి.బెళగల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను తల్లిదం డ్రులు వలసకు తీసుకెళితే తల్లికి వందనం పథకం రాదని ఎంఈవో ఆదాంబాషా అన్నారు. మండలం నుంచి విద్యార్థులు వలస వెళ్లకుండా ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామన్నారు. గూడూరు, సిబెళగల్ మండ లాల్లో 25 మంది విద్యార్థులను వలస వెళ్ల కుండా ఆపారన్నారు. చిన్న రామంజినే యులు, మంజులటీం, పోలీసులు ఉన్నారు.

20న ధర్నా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్దరించాలని కోరుతూ ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద ధర్నా చేయనున్న ట్లు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.నరసింహులు పిలుపునిచ్చారు. మంగళ వారం కేకే భవన్‌లో జిల్లా నాయకుడు ఎస్. ఖాజాబాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డును నిలి పేసి అన్యాయం చేసిందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, సుధనాక రప్ప, ఎం.నాగరాజు ఉన్నారు.

'అశోకా'లో నూతన ఆవిష్కరణ..


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా.నందిని

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రతన్ టాటా ఇన్క్యుబేషన్ హబ్ (ఆర్‌టీహెచ్) రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో నగరంలోని అశోకా మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులతో సృజనాత్మకత, వ్యాపార దృక్పథం, ఆవిష్కరనాత్మక ఆలోచనలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని ప్రిన్సిపాల్ డా. నందిని పేర్కొన్నారు. 28 బృందాలు పాల్గొని ఇంక్యుబేషన్ ప్రదర్శించాయి.

కూల్చివేతను ఆపాలి

గూడూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలో అనుమతి లేదన్న కారణంతో గృహ నిర్మాణాలను కూల్చివేయడం ఆపాలని టీడీపీ కౌన్సిలర్లు రేమట సురేష్, గిడ్డంగలి, ఖాజామున్ని అన్నారు. మంగళవారం ఇన్‌చార్జి కమిషనర్ విజయలక్ష్మికి వినతి పత్రం సమర్పించారు. పేదలు గృహనిర్మాణ శాఖ ఆర్థిక సాయంతో గృహాలను నిర్మించుకుంటున్నారన్నారు. లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేవన్న కారణంగా నగర పంచాయతీ అధికారులు ఆ గృహాలను కూల్చివేయడం సరికాదన్నారు.

రహదారి, డ్రైనేజీ నిర్మాణానికి రూ.18 లక్షలు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల వద్ద తొలగించిన దుకాణాల ప్రాంతంలో తారురోడ్డు, డ్రైనేజీ నిర్మించడానికి రూ.18 లక్షల నిధులు కేటాయిస్తూ నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. తారు రోడ్డుకు రూ.15 లక్షలు, డ్రైనేజీకి రూ.3 లక్షల నిధులు కేటాయించారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ సమస్య పూర్తిగా తగ్గుతుంది.

ఫిజియోల ప్రాముఖ్యత పెరిగింది


క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ..

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ఫిజియో థెరపిస్టుల పాత్ర పెరిగిందని జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న ఎల్‌వీటీజీ ఫిజియోథెరపీ కళాశాల ఫ్రెషర్స్ డే సందర్భంగా మంగళవారం అవుట్‌డోర్ స్టేడియంలో క్రీడా పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, త్రోబాల్, వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఫిజియోలు క్రీడాసాధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. గణేష్ నాయక్, ప్రిన్సిపాల్ శ్రీకాంత్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

నీకా..నాకా?

● రైతుబజారు షాపుల కేటాయింపులో మితిమీరిన రాజకీయ జోక్యం
● తలలు పట్టుకుంటున్న అధికారులు


రైతు బజార్‌లో నూతనంగా నిర్మించిన దుకాణాలు ఇవే..

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంపు రైతు బజార్‌లో ఇటీవలే మూడు దుకాణాలు నిర్మించారు. ఈ రైతు బజార్ రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. ఇక్కడ గజం స్థలం దొరికినా రూ.లక్షలు సంపాదించుకోవచ్చనే ఆలోచన వ్యాపారుల్లో ఉంది. అయితే ఈ దుకాణాలను దక్కించుకునేందుకు కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతున్నారు. దుకాణాలు తమకే ఇవ్వాలని రాజకీయనాయులతో ఫోన్లు చేయిస్తుండటంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. నిబంధనల ప్రకారం మార్కెటింగ్ శాఖ వేలం నిర్వహించి, అధికంగా పాడినవారికే అప్పగించాలి. అయితే రాజకీయ మితిమీరిన జోక్యంతే టెండర్లు నిర్వహించేందుకు మార్కెటింగ్ శాఖ అధికారులు వెనుకడుగు వేస్తున్నారు.

భూసార పరీక్షతోనే దిగుబడి

సి.బెళగల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష చేయిస్తేనే పంటల్లో అధిక దిగుబడులు సాధ్యమని ఏవో మల్లేష్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక రైతు బరోసా కేంద్రంలో భూసార పరీక్షలు చేయించిన రైతులకు ఫలితాల పత్రాలను అందజేశారు.

పనులు పూర్తి చేయండి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రిలో నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లను ఆదేశించారు. మంగళవారం సూపరింటెండెంట్ క్రిటికల్ కేర్ పనులను పరిశీలించారు. పనుల నాణ్యత, భవన నిర్మాణ దశలు, వైద్య పరికరాల ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలను సమీక్షించారు. 50 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తయితే అత్యవసర రోగులకు అత్యాధునిక సేవలు అందుతాయన్నారు. ఆర్ఎంవో డా.టీసీహెచ్ వెంకటరమణ, అడ్మినిస్ట్రేటర్ పి.సిందూ సుబ్రహ్మణ్యం, అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.శివబాల, ఏపీఎంఎస్ఐడీసీ డీఈ శిల్ప, జేఈ సెల్వం, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు బాలాజీ ఆప్టికల్స్ అధినేత ఆంజనేయులు గౌడు, కేఈ శివరాంగౌడ్ మంగళవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ నెల 14 నుంచి 16 వరకు విజయనగరం జిల్లాలో 12వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అండ్ జూనియర్, సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో వీరు పాల్గొంటున్నారు. వెయిట్ లిఫ్టింగ్ సెక్రటరీ పాపా, డీఎస్ఏ కోచ్ యూసుఫ్ బాషా స్టేడియం జేఏఫ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బంగారమ్మ అవ్వకు ప్రత్యేక పూజలు



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారధి

ఆదోని రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం గణేకల్లులో వెలసిన బంగారమ్మవ్వకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాదాపు రూ.కోటితో బంగారమ్మవ్వ నూతన ఆలయాన్ని నిర్మించారు. తెల్లవారుజాము నుంచే వేద పండితులు పూజలు ప్రారంభించారు. మహిళలు పెద్ద ఎత్తున దేవాలయానికి చేరుకొని అన్న పానియాలను నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే పార్థసారధి కార్యకర్తలతో కలిసి దేవాలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేపట్టి తనవంతుగా రూ.50వేలు విరాళంగా అందజేశారు. టీడీపీ నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, వెంకటేష్ చౌదరి, గణేకల్లు విరుపాక్షి, దొడ్డనగేరి శివప్ప, జాలిమంచి గోవిందు, తదితరులు పూజల్లో పాల్గొన్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దతుంబళం ఎస్.ఐ మల్లికార్జున సిబ్బందితో కలిసి బందోబస్తు చేపట్టారు.

ఆదోని: ఆదోని మండలం గనేకల్ గ్రామంలో నూతనంగా పునర్నిర్మాణం చేపట్టిన శ్రీబంగారమ్మ గుడిలో అవ్వ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకురాలు, కార్పొరేషన్ మాజీ సభ్యురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కపటి మాధవ, మల్లయ్య, బంగారు బాబు, ఎల్లప్ప, సుంకన్న, సవారి తిమ్మప్ప, లక్ష్మన్న, బెస్త ఓంకార్, మురళి, కల్లుబాయి మల్లికార్జున పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న గౌస్ దేశాయ్

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికై ఈనెల 20వ తేదీన తలపెట్టిన మహాధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో సీపీఎం జనరల్‌బాడీ సమావేశం దస్తగిరి అధ్యక్షతన జరిగింది. పత్తికొండ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, గ్రామాల్లో సీసీ రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలని, పత్తికొండలో రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టాలని డిమాండ్ చేశారు. పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ, బురుజుల గ్రామం వద్ద హంద్రీనీవా కాలువకు స్లూయిస్ ఏర్పాటు చేసి అనేక గ్రామాలకు నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. మహాధర్నా కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ శ్రేణులు తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, రంగారెడ్డి, గోపాల్, రవిచంద్ర పాల్గొన్నారు.

ఓటరు జాబితాను సరి చేయండి



మాట్లాడుతున్న తహసీల్దార్ గుండాల్ నాయక్

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 2022-25 వరకు ఓటరు జాబితాలో తప్పు ఒప్పులు సరి చేయాలని తహసీల్దార్ గుండాల్ నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారుల సమావేశం జరిగింది. ఓటరు జాబితాలో మరణించిన వారి పేర్లు, వివాహం చేసుకుని వెళ్లిపోయిన వారి పేర్లు తొలగించాలన్నారు. అలాగే శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లు కూడా తొలగించాలన్నారు. ఓటరు జాబితాలో కుటుంబ సభ్యులందరూ ఒకే వార్డులో ఉండే విధంగా చూడాలన్నారు. ఒక ఓటు ఒక ప్రాంతంలో, మరో ఓటు మరో ప్రాంతంలో లేకుండా చూడాల్సిన బాధ్యతబీఎల్వోలదే అన్నారు. ఓటరు జాబితాలో ఎలాంటి అక్రమాలు జరిగినా బీఎల్వోలదే బాధ్యత అని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్ఐ రామదాసు, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ జన్మదిన వేడుకలు



భర్తతో కలిసి కేకు కట్ చేస్తున్న నాగరత్నమ్మ

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్ర జ్యోతి): పత్తికొండ పట్టణంలో మంగళవారం మాజీ మండలాధ్యక్షురాలు నాగరత్నమ్మ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ మంత్రి ఎస్వీ సుబ్బారెడ్డి నాగరత్నమ్మ జన్మదిన వేడుకలకు హాజరై ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కొమ్ము దీపిక, పల్లె కళావతి, సోమశేఖర్, కొమ్ము నెట్టేకల్, బాల్‌రెడ్డి, టీఎండీ హుసేన్, పందికోన మల్లి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

'పత్తి విక్రయాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి '

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పత్తి సాగు చేసిన రైతులు పీఎం కిసాన్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఆ తర్వాత క్రాప్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ అయిన రోజున పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లాలని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మండలంలో పత్తిని 1500 ఎకరాల్లో సాగు చేశారన్నారు. రైతులు తప్పనిసరిగా పీఎం యాప్, క్రాప్ కిసాన్ యాప్‌లో సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. . అమ్మకానికి తీసుకెళ్లే పత్తిని తేమ శాతం 8-12 శాతం లోపు ఉండేలా చూసుకోవాలన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రజత పతకం



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీకాకుళం జిల్లా పలాసలో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అథ్లెటిక్ రాష్ట్ర స్థాయి పోటీలలో పెద్ద హరివాణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు రజత పతకం సాధించారు. మంగళవారం పతకాలు సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ రామన్న అభినందించారు. ఎస్ఎంసీ చైర్మన్ రమేష్, రవీంద్ర, శ్రీధర్, చిరంజీవి, నాగేంద్రుడు, శివరాజ్ పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల సంక్షేమమే ధ్యేయం : సీఎం

ఫుడ్ ప్రాసెసింగ్ పార్కును వర్చువల్‌గా ప్రారంభించిన చంద్రబాబు



సీఎం చంద్రబాబు వర్చువల్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ప్రజలు అధికారులు నాయకులు



శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న వైకుంఠం జ్యోతి, బొజ్జమ్మ

దేవనకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలు, ఏఐతో రాష్ట్రం భవిష్యత్ తరాల సంక్షేమమే ధ్యేయమని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. మండలంలోని ఈదుల దేవరబండ వద్ద రూ.17 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కును సీఎం కనిగిరి నుండి వర్చువల్‌గా ప్రారంభించారు. పరిశ్రమలు ఉపాధి కల్పనతో ప్రతి ఒక్కరు అభివృద్ధి దిశగా సాగాలన్ని సుచించారు. ఆలూరు టీడీపీ ఇన్‌చార్జీ వైకుంఠం జ్యోతి, వాల్మీకి చైర్మన్ బొజ్జమ్మ మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి కోసం కూటమీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వెనుకబడిన దేవనకొండ మండలంలో ప్రభుత్వం ఫూడ్‌ప్రాసెసింగ్ పార్కు ఏర్పాటుతో అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం ఫూడ్‌పార్కు శిలాపలాకాన్ని పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్‌తో కలసి ఆవిష్కరించారు. తహసీల్దార్ సుదర్శనం, టీడీపీ కన్వీనర్ విజయ్, సుభాన్, బి.రంగన్న, వీరేష్, మల్లికార్జున, మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రంగడు, వెంకటస్వామిగౌడ్, రామారావునాయుడు, మల్లయ్య, రాజశేఖర్‌గౌడ్, ఎంపీడీవో జ్యోతి, వీఆర్వో సురీడు, తదితరులుపాల్గొన్నారు.

అపోహలు నమ్మకండి : ఈదుల దేవరబండ వద్ద ఫూడ్‌పార్కు ఏర్పాటును కొంతమంది యురేనియం కోసమంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, అవన్నీ వదంతులని వైకుంఠం జ్యోతి, బొజ్జమ్మ అన్నారు. బయట ఇతరులు ఫూడ్‌పార్కు అభివృద్ధిని అడ్డుకొవాలని, వదంతులు వ్యాప్తి చేస్తున్నారని వాటిని పట్టించుకొవద్దని ప్రజలకు సుచించారు..

బాధ్యతగా విధులు నిర్వహించాలి



నూతన ఉపాధ్యాయులకు ఎస్ఆర్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని ఎస్టీయూ నాయకులు కోరారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సర్వీస్ రిజిస్టర్లపై అవగాహన కల్పించి ఉచితంగా ఎస్ఆర్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలుర-2 ఉపాధ్యాయులందరికీ సర్వీసు పుస్తకాలు ఎస్టీయూ యూనియన్ తరఫున ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర నాయకులు నాగరాజు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అలాగే సంఘం నియమ, నిబంధనలు వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు బంటనహాల్ నాగరాజు, జిల్లా నాయకులు సురేంద్ర, నేమకల్ నాగరాజు, మండల అధ్యక్షులు మౌలేష్, మండల సీపీఎస్ కన్వీనర్ కృష్ణ, రాజేంద్ర, విమల్‌తేజ్, రామాంజనేయులు, రామకృష్ణ, హనుమంతప్ప, మద్దిలేటిబాబు, నాగార్జున, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు తప్పవు

తుగ్గలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు, అధికారులు విధులక డుమ్మా కొడితే చర్యలు తప్పవని ఎంపీడీవో విశ్వమోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నంపల్లె సచివాలయాన్ని అకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు సచివాలయ రికార్డులను తనిఖీ చేసి అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయం పనివేళలో ఏ అధికారి అయినా విధులకు గైర్హాజరైతే వారిపై చర్యలు తీసుకోవడతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్రతి అధికారి ప్రతి రోజు వారి గ్రామాల్లోని సచివాలయంలో అందుబాటులో ఉండి ప్రజలకు అవసరమైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తిక్ రంగనాథ్ తదితరులు ఉన్నారు.

18, 19న రాష్ట్రస్థాయి పత్తి రైతు సమ్మేళనం

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో ఈనెల 18, 19వ తేదీల్లో జరిగే పత్తి రైతుల రాష్ట్రస్థాయి సమ్మేళనానికి పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని జయప్రదం చేయాలని రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య పత్తి రైతులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సి.ఆర్.భవన్‌లో రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా పత్తిని నమ్ముకుని రైతులు లక్షలాది ఎకరాల్లో సాగు చేస్తున్నప్పటికీ అధిక వర్షాల వల్ల పత్తి పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. క్వింటం పత్తికి రూ.12 వేలు మద్దతు ధరతో సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలని తదితర డిమాండ్లపై ఈనెల 18, 19వ తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి పత్తి రైతుల సమ్మేళనానికి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ౹ రాజాసాహెబ్, సురేంద్రకుమార్, ౹ కారన్న, కారుమంచి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఎంపీటీసీ సభ్యులు ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : ఈనెల 18,19 తేదీలలో రాష్ట్ర పత్తి రైతుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయ్య, కార్యదర్శి పంపన్న గౌడ్ కోరారు. మంగళవారం ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పత్తి రైతులతో వారు మాట్లాడి అవగాహన కల్పించారు. రైతు సంఘం నాయకులు మద్దిలేటి నాయుడు, బసాపురం గోపాల్, కల్లుబావిరాజు, సుదర్శన్, సత్యనారాయణ, ఎల్లప్ప, గంగన్న, గిరి మల్లప్ప పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు తగవు : సీఐటీయూ

ఆలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో కొన్నేళ్లుగా పాఠశాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల శుభ్రం చేస్తూ తక్కువ వేతనాలతో పనిచేస్తున్న స్కావెంజర్‌లను రాజకీయ ఒత్తిళ్లతో తొలగించడం తగదని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ.నారాయణస్వామి అన్నారు. మంగళశారం కరిడిగుడ్డం, పెద్దహోతూరు గ్రామాల్లో తొలగించిన స్కావెంజర్‌లను తక్షణమే తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నారాయణస్వామి, షాకీర్ మాట్లాడుతూ నిరుపేద మహిళలు కుటుంబాన్ని పోషించుకునేందుకు తక్కువ వేతనంతో పనిచేసిన కార్మికులను తొలగించడం అధికార పార్టీకి తగదన్నారు. మహిళా సంఘం నాయకులు షేకున్‌బీ, రత్నమ్మ, గౌసియాబి. స్కావెంజర్స్ రంగమ్మ, సిద్ధమ్మ, రూప, సక్కుభాయ్, హేమావతి, మంగమ్మ, చంద్రమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వ్యవసాయ తోటలకు ఈ నెల 13వ తేదీ నుంచి విద్యుత్ సరఫరాలో మార్పులు చేయడం జరుగుతుందని విద్యుత్ ఏఈ మహ్మద్ రఫీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతుల కోరిక మేరకు ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి మరలా 12 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఇవ్వడం జరుగుతుందన్నారు. రైతులు ఈ మార్పులను గమనించాలని తెలిపారు. లైన్‌మెన్ వెంకట్రాముడు పాల్గొన్నారు.

పిల్లలందరూ ఆరోగ్యంగా ఉన్నారు..



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

ఆదోని రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అస్వస్థతకు గురైన నాగలాపురం అంగన్‌వాడి విద్యార్థులందరూ ఆరోగ్యంగా ఉన్నారని ఐసిడిఎస్ పిడి విజయ తెలిపారు. సోమవారం అంగన్‌వాడి-2 సెంటర్‌కు వెళ్ళిన 10మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిన్న తరువాత అస్వస్థతకు గురయ్యారు. వీరిలో సుదర్శన్, వైశాలి పరిస్థితి బాగ లేకపోవడంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న ఐసిడిఎస్ పిడి విజయ, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఓ మాధవిలత, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ మధు కృష్ణాచారి, తదితర శాఖల అధికారులు గ్రామానికి వెళ్లి అంగన్‌వాడి కేంద్రాలయాన్ని తనిఖీ చేయడంతోపాటు విద్యార్థులు తాగిన పాల ప్యాకెట్లను, బ్యాళ్లు, గుడ్లు, కూరగాయలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ, ఆహారం విషతుల్యం కాకుండా జాగ్రత్త పడాలని, కేంద్ర పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బంది సూచించారు. అస్వస్థతకు గురైన 10మంది విద్యార్థులు అందరూ ఆరోగ్యంగా ఉన్నారని, రెండు రోజులుగా తమ సిబ్బంది గ్రామంలో హెల్త్ క్యాంపు చేపట్టి ఇక్కడే ఉంటున్నారని డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో మాధవి లత పేర్కొన్నారు. ఎమ్మెల్యే పార్థసారధి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వారి ఆరోగ్య స్థితి గతులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటి ఘటనలు పునరుద్ధరణ కాకుండా అన్ని శాఖల అధికారులు కలిసి కట్టుగా ముందుకెళ్లాలన్నారు. సీపీఎం నాయకులు లక్ష్మన్న, లింగన్న, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు.

రేపు మార్కెట్ వేలం పాట

దేవనకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 13న దేవనకొండ గ్రామపంచాయతి ఆవరణంలో కూరగాయల మార్కెట్‌కు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతి కార్యదర్శి ఏఎండీ రఫీ తెలిపారు. దరవత్తు రూ. 2లక్షలు చెల్లించి, నిబంధనల మేరకు నిర్వహాకులు వేలం పాటలో పాల్గొన్నలన్నారు.

ఘనంగా అబుల్‌కలాం ఆజాద్ జయంతి



పత్తికొండలో అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ముస్లింలు

పత్తికొండ టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ పట్టణంలో మంగళవారం దేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని 137వ జయంతిని పురస్కరించుకుని మహమ్మదీయ మసీదులో మసీదు ప్రెసిడెంట్ సాహెదీన్ ఆధ్వర్యంలో ముస్లింలు మౌలానా అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే ఎస్టీయూ కార్యాలయంలో మండల అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, మారుతిల ఆధ్వర్యంలో మౌలానా అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు.

తుగ్గలి: విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు మరువలేనివని నోవీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిప్పయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన తుగ్గలి నోవీ పాఠశాలలో దేశానికి మొట్టమొదటి విద్యాశాఖమంత్రి అబుల్ కలాం జయంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

మాతా మల్లేశ్వరమ్మ దేవర ఉత్సవాలు



కలశాలలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఆదోని టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విక్టోరియా పేటలో మాత మల్లేశ్వరమ్మ(మల్లాలమ్మ) దేవర ఉత్సవాలను మంగళవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. కార్తీక మాసం మూడవ మంగళవారం పురస్కరించుకుని అమ్మవారి దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి ఆకుపూజ, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. మహిళలు కలశాలు చేత పట్టుకొని డప్పు వాయిద్యాలతో కుంభోత్సవంలో ఉత్సాహంగా ఊరేగింపులో పాల్గొన్నారు. మేదరి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో సంఘం నాయకులు నల్లారెడ్డి, వీరయ్య, తిమ్మప్ప, వెంకోబ, కండక్టర్ వీరేష్ బాబు, బుడ్డేకల్ తిమ్మప్ప పాల్గొన్నారు.

వైసీపీ ప్రజా ఉద్యమానికి తరలిరండి

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

ఆలూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం తలపెట్టిన ప్రజా ఉద్యమానికి పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ వల్ల పేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఆరు మండలాల నుంచి కార్యకర్తలు తరలిరావాలన్నారు.

తుగ్గలి: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంతో పేద విద్యార్థులకు వైద్యవిద్య దూరం చేయడమేనని వైసీపీ బూత్ కమిటి జిల్లా ఉపాధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కడమకుంట్లలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడంపై రచ్చబండ కార్యక్రమం నిర్వహించి కోటి సంతకాల సేకరణ చేపట్టారు. మాజీ సర్పంచ్ సునీత, మాజీ ఎంపీటీసీలు రామాంజనేయులు, ఆదిలక్ష్మి, హనుమంతరెడ్డి, రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ టౌన్: రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేట్ పరం చేయాలని చూస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతుందని, పీపీపీ విధానాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పత్తికొండలో పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ కరెంట్ ఆఫీసు సమీప కాలనీల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే చేపట్టారు. నాగరత్నమ్మ, కొమ్ము దీపిక, నారాయణదాసు, వైసీపీ నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు మెరుగుపడాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాకాంత్‌రెడ్డి

వెల్దుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు మెరుగు పడాలని సింగిల్‌విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి ఆదేశించారు.మండల కేంద్రమైన వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో మంగళవారం డిప్యూటీ ఎంపీడీవో ఆధ్వర్యంలో ఎంపీపీ దేశాయి లక్ష్మీదేవమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గడిచిన మూడు నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి, రాబోయే మూడు నెలల కాలంలో చేపట్టబోయే పనుల గురించి చర్చించారు. సింగిల్ విండో చైర్మన్ రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వెల్దుర్తిలో వీధి దీపాలు వెలగడం లేదని, చెత్తసేకరణ, పారిశుధ్య పనులు సరిగా చేయడం లేదని మెరుగు పడాలని సభదృష్టికి తీసుకువచ్చారు. ఏవో అక్బర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్, ఏపీవో లక్ష్మన్న, ఏపీఎం అనురాధ, ఇంచార్జీ హౌసింగ్ ఏఈ బాలకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

స్వర్ణామృత ప్రాసనం పంపిణీ

ఆదోని టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో, వికాస తరంగిణి సహకారంతో కాకుబాల్ నగేష్ సౌజన్యంతో మంగళవారం చిన్నారులకు స్వర్ణామృత ప్రాసనం ఔషధాన్ని పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, 18వ విడతగా 193 మంది చిన్నారులకు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలిగించే ఈ ఔషధాన్ని అందించడం జరిగిందని తెలపారు. సంస్థ సభ్యులు రఘు, ఈరన్న శెట్టి, వెంకటేష్ బాబు, యాదగిరి వెంకటేశ్వర్లు వంకదారు మమతశ్రీ, శ్రీదేవి, అనిత, మైత్రీయి, మణి పాల్గొన్నారు.

సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలి

దేవనకొండ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సహజపద్ధతుల్లో రైతులు వ్యవసాయం చేయాలని ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్ అన్నారు. స్థానిక రైతుసేవా కేంద్రంలో మండలంలోని రైతులతో వాతవరణ మార్పులు-వ్యవసాయంపై వాటి ప్రభావం అనేఅంశంపై సమావేశం మాట్లాడారు. సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. మట్టి సామర్థ్యాన్ని బట్టి పంటల మార్పిడి చేయాలని సుచించారు. ఏవో ఉషారాణి, మారీ ఏఈవో హుమాయూన్‌బాషా, ఏటీఈ దివ్యారెడ్డి, తదితరులు ఉన్నారు.

అమరుల ఆశయ సాధనకు కృషి

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటంలో అమరులైన వారి ఆశయం సాధన కోసం కృషి చేద్దామని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని అమరుల చిత్రపటాలకు నివాళులర్పించి జెండాను ఎగరవేశారు. స్వేచ్ఛా, సమానత్వం కోసం నూతన ప్రజాస్వామ్య వ్యవస్థకోసం పోరాడి అసువులు బాసిన ఎంతో మంది వీరులు ఉన్నారన్నారు. వారి స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సత్యన్నా, బాలరాజు, రఫీ బాబు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న వెంకట మాధవ్

మద్దికెర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే.. మంచి ప్రయోజకులు అవుతారనీ శ్రీవిద్యాసాయి కళాశాల ఎండీ యజ్ఞం వెంకట మాధవ్ అన్నారు. మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు ప్రిన్సిపాల్ బాల సునీత ఉన్నారు.

అన్నదానానికి విరాళం

వెల్దుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తిలో వెలసిన శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో 'అయ్యప్ప మాలధారుల'కు నిర్వహిస్తున్న అన్నదానానికి వెల్దుర్తికి చెందిన చక్రపాణి రూ.5 వేల విరాళం మంగళవారం ఆలయకమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. మధు, శేఖర్, భరత్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటం

ఆలూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చదువు-పోరాడు అనే నినాదంతో విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ 50వ జిల్లా మహాసభలను ఆలూరులో డిసెంబర్ 4, 5వ తేదీల్లో నిర్వహిస్తున్న సందర్భంగా ఆలూరు జూనియర్ కళాశాల ఆడిటోరియంలో మాజీ ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మైనా అధ్యక్షతన ఆహ్వాన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు మల్లేష్, మెదేహాల్, వీరేష్, ఎస్.కె.గిరి, జె.వీరేష్, జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ జిల్లాలోని పశ్చిమప్రాంతం ఆలూరులో ఉపాధి లేక తల్లిదండ్రులు వలసలు వెళ్తున్నా పిల్లలు, విద్యార్థులు చదువుకు దూరమవుతున్నా పాలకులకు, ప్రభుత్వాలకు చీమకుట్టినట్లుగా కూడా లేదన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరేష్, బాలికల పాఠశాల హెచ్‌ఎం యం.సుజాత, ప్రగతి స్కూల్‌కరస్పాండెంట్ గురునాథ్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు కె.పి.నారాయణస్వామి, పి.హనుమంతు, సీనియర్ జర్నలిస్టులు సోమన్న, చంద్రబాబు, తిక్కస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పన్నులు వసూలు చేయాలి

ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి



మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పన్నులు సక్రమంగా వసూలు చేయాలని ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పన్నులు, అసిస్‌మెంట్లకు మొబైల్ నంబర్ల ఫీడింగ్, ఘన వ్యర్థాల నిర్వహణ, ఐవీఆర్ఎస్ కాల్స్, స్పందన తదితర అంశాలపై సమీక్షించారు. అలాగే అన్ని గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం పనులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో బంగారమ్మ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు



ఆనందం వ్యక్తం చేస్తున్న చదువుల రామయ్య కాలనీ వాసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గోనెగండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చదువుల రామయ్య కాలనీలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు పీఆర్ఏఈ శివశంకర్ తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'కనీస సౌకర్యాలు కరువు' అన్న కథనం ప్రచురితమైంది. అందు కు గాను స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్పందించారు. చదు వుల రామయ్య కాలనీలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పల్లె పండుగ 2.0 కార్యక్రమంలో మొదటి ప్రాధాన్యం కింద రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈవిషయం తెలుసుకున్న కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ సమస్య లను అధికారుల, నాయకులు దృష్టికి తీసుకువెళ్లే పరిష్కార మార్గం చూపిన 'ఆంధ్రజ్యోతి'కి కాలనీ వాసులు ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు దుద్ది విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కోసిగి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్ది హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అయ్యస్వామి తెలిపారు. మంగళవారం దుద్ది హై స్కూల్‌లో విద్యార్థులను అభినందించారు. అండర్-16 కబడ్డీ పోటీలకు నరసింహులు, అండర్-14 ఖో-ఖో పోటీలకు లల్లి, రాఘవేంద్ర ఎంపికయ్యారన్నారు. రాష్ట్ర స్థాయికి పోటీలకు తర్ఫీదు ఇచ్చిన పీడీ లక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పులుసు నారాయణ, నాగలక్ష్మి, లక్ష్మీకాంతరెడ్డి, సునీత, రామాంజనేయులు, పుష్పావతి, రమేష్ ఉన్నారు.

అంబా భవానికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న స్వరూపానంద స్వామీజీ

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోనెగండ్ల రోడ్డులో వెలసిన అంబా భవాని దేవాలయంలో 25వ వార్షికోత్సవ పూజలు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విఠల్ రావు, ప్రధాన కార్యదర్శి కామళే గణేష్ మాట్లాడుతూ స్వకుల సమాజ్ వారి అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలు,.ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, ముఖద్వార ప్రతిష్ఠ పూజలను భక్తులు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కృష్ణ కాలచక్ర కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ, మాజీ ఎంపీ బుట్టా రేణుక, ఆదోని మార్కెట్ యార్డు ఛైర్మన్ జిందే శారద శంకర్ పూజలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మాచాని వెంకటేష్, శివకుమార్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: వైసీపీ



కోటి సంతకాల పత్రాలను ఆవిష్కరిస్తున్న సీవీ విశ్వనాథరెడ్డి, నాయకులు

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైసీపీ జిల్లా కార్యదర్శి సీవీ విశ్వనాథరెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరే కిస్తూ కోటి సంతకాల సేకరణను మంగళవారం మండలంలోని చిలకల డోణ, సూగూరు గ్రామాల్లో వైసీపీ నాయకులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్యవిద్యను దూరం చేయడానికే సీఎం చంద్రబాబు పీపీపీ విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. సమావేశంలో వైసీపీ నాయకులు అంజని, హనుమంతు, రాగప్ప, ఒంకారు రెడ్డి, వీరేష్ రెడ్డి, వీరనాగుడు, గోపినాథ్, దేవదాసు, అశ్వత్‌రెడ్డి, లక్ష్మయ్య, నేపాల్, సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి పెద్దపీట

● త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన
● పాల్గొన్న ఎమ్మిగనూరు, ఆదోని ప్రజాప్రతినిధులు, అధికారులు



త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, హోటల్ డైరెక్టర్లు, అధికారులు

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేస్తుందని ఎమ్మిగనూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారథి అన్నారు. మంత్రాలయంలో కూటమి ప్రభుత్వం వెంకటేశ్వర త్రీస్టార్ హోటల్ నిర్మాణానికి ప్రకాశం జిల్లా కనిగిరి నుంచి సీఎం నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. మంగళవారం మంత్రాలయంలో అబోడే హోటల్ ప్రాంగణంలో పరిశ్రమలు - ఉపాధి కల్పనలో భాగంగా శ్రీవెంకటేశ్వర హోటల్స్ డైరెక్టర్లు మౌనేష్, కార్తీక్, డిప్యూటీ జనరల్ మేజర్ నరేంద్ర తివారీ, అబోడె హోటల్ మేనేజర్ రజినీకాంత్ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు, ఆదోని ఎమ్మెల్యేలు బీవీ జయనాగేశ్వరరెడ్డి, డాక్టర్ పార్థసారథి, టీడీపీ, జనసేన మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్నలు శిలాఫలకాన్ని, హోటల్ నమూనాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆదోని, ఎమ్మిగనూరు ప్రాంతాల్లో ఇలాంటి హోటల్ నిర్మాణానికి ముందుకొస్తే స్థలం ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అదే విధంగా టీడీపీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జీలు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్న మాట్లాడుతూ ఇంటింటికి పారిశ్రామిక వేత్తగా ఎదిగేందుకు యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హోటల్ యజమానులు ప్రజాప్రతినిధులను, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో ఆదోని సబ్‌కలెక్టర్ అజయ్‌కుమార్, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ మల్లయ్య, టూరిజం జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, మండల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్క్ పనులకు..

పెద్దకడబూరు: మండలంలోని హనుమాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఎంఎస్ఎంఈ పార్కు పనులను సీఎం నారా చంద్రబాబునాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, రమాకాంతరెడ్డి, నరవ శశిరేఖ, మల్లికార్జున, పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, తహసీల్దార్‌లు గీతాప్రియదర్శిని, శేషఫణి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణతకు కృషి

పరీక్షల విభాగం ఏసీ గోవింద్ నాయక్



విద్యార్థులకు సూచనలిస్తున్న గోవింద్ నాయక్

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని విజయవాడ ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్‌నాయక్ అన్నారు. మంగళవారం మంత్రాలయం మండలంలోని మాధవరం జడ్పీ, సెంట్ మార్తోమా, పరిమళ పాఠశాలలను జిల్లా కోర్డినేటర్ ఖాన్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, బోధన, మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, పరీక్షల నిర్వహణ, ఆయాల పని తీరును పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘన్న, హెచ్‌ఎంలు భోజరాజు, రాఘ వేంద్ర, చంద్రశేఖర్ ఆచార్, జాన్‌జాకోబ్, ఆనందు, రామ్మోహన్, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో ఈరన్న ఉన్నారు.

ఉద్యోగాలు ఇవ్వాలి

ఎమ్మిగనూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తూ మృతి చెందిన కార్మిక కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఏఐటీయూసీ తాలుకా కార్యదర్శి తిమ్మగురుడు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ కోరారు. మంగళవారం కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు పాల్గొన్నారు.

హంద్రీకి జీడీపీ నీరు విడుదల

జీడీపీలోకి ఎల్లెల్సీ నీటిని నిలిపివేసిన అధికారులు



గోనెగండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి మంగళవారం మధ్యాహ్నం నుంచి జీడీపీ ఇరిగేషన్ అధికారులు హంద్రీనదికి జీడీపీ 4వ గేటు ద్వారా నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు 4వ గేటు ఎత్తి 336 క్యూసెక్కుల నీటిని హంద్రీనదికి విడుదల చేసినట్లు ఏఈ మహమ్మద్ ఆలీ తెలిపారు. అయితే మరో రెండు రోజులలో తుపాన్ రానున్నట్లు వాతావణశాఖ సమాచారం ఇవ్వడంతో ముందస్తుగా జీడీపీ గేట్లు ఎత్తి నీరు విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ తదితర ప్రాంతాలలో అక్కడక్కడ అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా హంద్రీ నుంచి రోజుకు 60 నుంచి 70 క్యూసెక్కుల నీరు వచ్చి చేరేది. గత 20 రోజులుగా ఎల్లెల్సీ నీరు జీడీపీకి మళ్లించిన అధికారులు మంగళవారం నీటి మళ్లింపును నిలిపివేశారు. ప్రస్తుతం గాజులదిన్నె ప్రాజెక్టులో నీటి మట్టం పూర్తి స్థాయిలో ఉన్నట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రకు నీటి మట్టం(4 టీఎంసీ) 376.78 మీటర్లు ఉంది. దీంతో జీడీపీ నిండు కుండలా మారింది. జీడీపీ పూర్తిస్థాయి నీటి మట్టం 377 మీటర్లు అయితే ప్రస్తుతం కేవలం 0.22 మీటర్లు మాత్రమే తక్కువ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నందవరం నాయకులు

నందవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నందవరంలో దేవళ్ల రాముడుకు ఏపీ బీసీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇవ్వడంపై దేవళ్ల ఇంటి సభ్యులంతా, అలాగే నందవరం నాయకులు కలసి మంగళవారం ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డిని సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన పదవికి వన్నె తెచ్చి కార్యకర్తలకు ఉపయోగపడాలన్నారు. రాముడు మాట్లాడుతూ తనను నమ్మి పదవి ఇచ్చారని అందరికీ న్యాయం చేస్తానన్నారు. ఇందుకు ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా ధన్యవాదలు తెలిపారు. అనంతరం నాయకులు సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో దేవళ్ల పెద్దరాముడు, దేవళ్ల లచ్చప్ప, దేవళ్ల నాగరాజు, దేవళ్ల బీమశేఖర్, నాయకులు మస్తాన్, షరీఫ్, ఈస, మాల నరసప్ప పాల్గొన్నారు.

మంచాలమ్మకు విశేష పంచామృతాభిషేకం

మంత్రాలయం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. మంగళవారం కార్తీక సప్తమి శుభ దినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం





కౌతాళంలో జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, కోసిగిలో అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న హెచ్ఎం

కౌతాళం, నవంబరు, 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని, జాతీయ విద్యా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా కౌతాళం సీఐ అశోక్ కుమార్ హాజరై మౌలానా చిత్రపటానికి పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతం పాఠశాల విద్యార్థులు వివిధ నేతల వేషధారణలతో 150 మీటర్ల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దూద్‌బాషా, ఆర్గనైజరు సయ్యద్ మైనుద్దీన్, ఉపాధ్యాయులు జయలక్ష్మి, ఈరన్న, భీమేష్ ఉన్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జి.పరిమళదేవి ఆధ్వర్యంలో జాతీయ విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీ ఖలీల్ అహ్మద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రాలయంలో ముమ్మర తనిఖీలు



మంత్రాలయంలో డాగ్, బాంబు స్క్వాడ్‌లతో తనిఖీ చేస్తున్న పోలీసులు

మంత్రాలయం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): డిల్లీలో ఎర్రకోట సమీపంలో జరిగిన భారీ పేలుళ్ల దృష్ట్యా మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. మంగళవారం కర్నూలు జిల్లా నుంచి వచ్చిన డాగ్, బాంబు స్క్వాడ్‌లతో నదితీరం, మధ్వమార్గ్ కారిడార్, తుంగభద్ర, సంస్కృత పాఠశాల కారిడార్, రాఘవేంద్రసర్కిల్, శ్రీమఠం ప్రాంగణం, అన్నపూర్ణ భోజనశాల, ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీలు చేశారు. ఆయా లాడ్జీ యజమానులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, రంగస్వామి, రామకృష్ణ, సురేంద్ర, ప్రతాప్, జమీర్, నాగేశ్వరరెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సర్వసాధారణం

నందవరం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ సర్వసాధారనమని టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురంలో ఎంపీపీ స్కూల్‌లో పని చేస్తున్న రాముడు పదవీ విరమణ కావడంతో ఆయనను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఆయన పాఠశాలకు చేసిన సేవలు గురించి కొనియాడారు. అలాగే సహకార సంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్ మాట్లాడుతూ గురువు దైవంతో సమానమని విద్యార్థుల మధ్య తారతమ్య బేధాలు లేకుండా విద్యాబుద్ధులు నేర్పి ఎందరికో బాటసారిగా నిలిచారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలీ, సుధీర్, ఉదయ్‌గౌడు పాల్గొన్నారు.

బస్టాప్ ఏర్పాటు చేయాలి



ఆర్టీసీ డీఎంకు వినతి పత్రం ఇస్తున్న మహబూబ్ బాషా

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల సమీపంలో ఆర్టీసీ బస్సులకు స్టాప్ ఏర్పాటు చేయాలని ఎస్ఎంసీ ఛైర్మన్ మహబూబ్ బాషా కోరారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ మద్దిలేటిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బనవాసి గ్రామం సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల, కాలేజీ క్యాంపస్ నుంచి దాదాపు 30మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నా రన్నారు. సమీపంలో బస్టాప్ లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారన్నారు. స్థానికంగా బస్సులు నిలిపేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ జీర్ణోద్ధరణ పనులకు విరాళం

కౌతాళం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న జీర్ణోద్ధరణ పనులకు ఓ భక్తుడు విరాళం ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌కు చెందిన లక్ష్మీకాంత్‌శెట్టి కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కార్యాలయంలో రూ.50,116ల నగదును విరాళంగా ఇచ్చారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.



దాతకు స్వామివారి ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు

ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ

గోనెగండ్ల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే సస్యరక్షణ చర్యలు తప్పని సరిగా పాటించాలని ఏరువాక ప్రధానశాస్త్రవేత్త సుజాతమ్మ అన్నారు. మంగళవారం పుట్టపాశం, తిప్పనూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు నిర్వహించారు. శాస్త్రవేత్తలు సుజాతమ్మ, సతీష్, ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ కంది, మొక్కజొన్న, పప్పుశనగ పంటలను పరిశీలించారు. పొలాల్లో జింక్ లోపం ఉన్నట్లు గుర్తించారు. అలాగే మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు సోకినట్లు తెలిపారు. పురుగు నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పులిరాజు, అరుణ, తస్లీమ్, రఘు, గ్రామ రైతులు కౌలుట్ల, ఎలీషా, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో భూమాత రక్షణ కమిటీలు: ఏవో

ఎమ్మిగనూరు: మండలంలోని ప్రతి గ్రామంలో భూమాత రక్షణ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు ఏవో శివశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని ఏనుగబాల, దైవందిన్నె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఏవో మాట్లాడుతూ భూమాత రక్షణ కమిటీల్లో గ్రామసర్పంచ్, పంచాయతీ సెక్రటరీ, సచివాలయం వీఏఏ, ఇద్దరు రైతులు ఉంటారన్నారు. వీరు గ్రామంలో రైతులకు పంటల సాగు, పురుగుమందులు, ఎరువులు వాడకంపై , ప్రకృతి వ్యవసాయం పై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు నరసింహా, వినోద్, రసూల్, రైతులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు వాడొద్దు

కోసిగి: రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతోనే పంటలు పండించాలని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. మంగళవారం కోల్‌మాన్‌పేట గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ తరుపున బయో రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది హనుమంతు, ఆంజనేయులు, మధు, రైతులు రామాంజనేయులు పాల్గొన్నారు.

మిరప పంటపై రైతులకు అవగాహన ఉండాలి

నందవరం: మిరప పంటలో రసం పీల్చే పురుగుల వల్ల ఆకు కింద మడత అలాగే మడతలు మొక్కల ఎదుగుదలను నియంత్రించి పంట దిగుబడి తగ్గిస్తుందన్నారు. మంగళవారం నందవరంలో పొలం పిలుస్తోంది. అలాగే బూమాత సంరక్షణ కార్యక్రమం జరిగింది. రైతులు మిరపపై సస్యరక్షణ చర్యల్లో భాగంగా జీవ నియంత్రకాలు బవేరియా, బేసియాన, వేపనూనె 5 ఏంఎల్ లీటర్ నీటిని కలిపి వాడాలి. ఉధృతి ఎక్కువైతే పురుగుల మందులైన ఇమిడాక్లో ప్రైడ్ 0.2ఏంఎల్ లేదా అబామేక్టిన్ 0.2ఏంఎల్ లీటర్ నీటికి తీవ్రత ఎక్కువగా ఉన్నచో వారం వ్యవధిలో రెండు స్ప్రేలు చేయాలి. అలాగే నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలన్నారు. భూసారా పరిక్షలు అనుగుణంగా ఎరువులను వాడాలి. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ



ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న ఏవో శివశంకర్



నందవరంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఏవో